కథానిక

# పేపరు కుర్రాడు

బి. నాదమునిరాజు

"స్తార్! పేపర్ సార్. ఒకణా. తాజా ఎన్నికల ఫలితాలు. తీసుకోండి సార్" అంటూ వెంటబడ్డాడు. పధ్నాలుగేండ్లుంటాయ్. చురుకైన కళ్లు. మాసికలువేసిన చొక్కా అయినా శుభ్రంగా వుంది.

"వద్దబ్బాయ్! మా యింటికొస్తుంది పేపర్" అన్నా.

పాపం. ఆ పిల్లవాడి ముఖం ఎండుటాకులా వెలవెలపోయింది. నన్ను నా దుస్తుల్ని చూచి తప్పక పేపర్ కొంటానని అంచనావేసి ఉంటాడు. తలక్రిందయింది తన అంచనా. విచార సూచకంగా ఒక క్షణం అట్లా తచ్చర్లాడి ప్రక్కన్నే ఒక ఖద్దరు బట్టల ఆసామి పోవడం చూచి వెంటబడ్డాడు.

రెండు నిమిషాలు. రెండే రెండు నిమిషాలు. ఆ అబ్బాయి నా మనసులో కదిలాడు. ఏం చురుకైన కండ్లు. ఆ కండ్లే చెప్పక చెబుతున్నాయి మంచి చురుకైనవాడని. ఎంతో అభివృద్ధికి రాతగినవాడు. కాని అభివృద్ధిలేని పాడు బ్రతుకు. ఆ జాలి చూపులు నే నింటికి పోయేంతదూరం వెంటాడినట్లే వున్నాయ్. అణా యిచ్చేసి పేపర్ తీసుకున్నా బాగుండేది. వెనుదిగిరి చూశా. కనుచూపు మేరలో ఎక్కడా అగుపించలా. ఇంతలో ఒక మిత్రుడు ఎదురు రావడం, మేము కాఫీ హోటల్లో దూరడం జరిగింది.

మరునాడు. అదే వేళ. ఉదయం ఎనిమిది గంటలు. ఏదో పోగొట్టుకున్నవాళ్లలా జనం రాకపోకలు సాగిస్తున్నారు. నేనూ కల్మశంతో నిండి ఈగలు ముసిరే రోడ్లను, ప్రక్కనే పిల్ల కాలువలవలె పారే మురికి కాలువలు చూస్తూ మునిసిపాలిటీ పరిపాలనను అభినందిస్తూ మామూలు హోటల్‌కు వెళ్ళాను. కాఫీ త్రాగి బయటికి వస్తున్నా. హోటల్ వాకిట నిలబడి పేపర్ల కట్ట చంకన బెట్టుకొని ఒక పేపర్ మౌనంగా చదువుతున్నాడు నిన్నటి పేపర్ కుర్రాడు. నేను బయటికి నడిచే శబ్దం విని "సా-ర్" అన్నాడు. కాని నా ముఖం చూచిన వెంటనే ప్రక్కకు తిరిగాడు. మా యింటికి పేపర్ వస్తుందని నిన్న నే అన్న నాకే తిరిగి పేపర్ యివ్వ వచ్చినందుకు సిగ్గుపడినట్లుంది. పెద్ద అడుగులు వేసుకొంటూ రోడ్డుకు పోబోతున్నాడు.

"అబ్బాయ్! ఓ పేపర్ బ్బాయ్!" పిలిచా. దగ్గర వచ్చి నిలబడ్డాడు. నమ్రతతో "ఏం" అని అడిగినట్టున్నాయ్ అతని కండ్లు.

"ఓ పేపరివ్వు."

"ఇంటికి వస్తుందన్నారు గదా బాబయ్యా"

"అయినా యింకోటి కావాలి. యివ్వు" అన్నా జేబులోనుంచి మనీపర్సు తీస్తూ. పావలా చేతికిచ్చేసి. "చిల్లర లేదు. ఆ హోటల్ వద్ద తెస్తా. ఓ నిమిషం ఆగండి" అంటూ గబగబ హోటల్ వైపు పోతోంటే "వుంచుకో. కాఫీ త్రాగు" అని బయలుదేరా.

నేను నిలబడకుండా త్వరితంగా పోతున్నా. ఒక యిరవైగజాలు దాటానో లేదో పేపర్ కుర్రాడు "బాబూ" అంటూ రావడం. నాచేతిలో మూడణాలు వేయటం జరిగింది. నేను మాట్లాడేందుకు కూడ అవకాశం చిక్కనీకుండా యింకో మనిషి పోతోంటే పేపరు తీసుకోమని. ఆయన వెంట పోయాడు కుర్రాడు.

నడచిపోతున్నా. నేను కాదు నడచి పోయేది. కాళ్లు నడుస్తున్నాయి. నామనసంతా పేపర్ల కుర్రాడు ఆక్రమించాడు. ఆ దీనవదనం చురుకయినగూడ జాలిగొలిపే కండ్లు నా వెంటనే వచ్చినట్లున్నాయి. ఈ కుర్రాడి నైతిక విలువలో ఏ నాలుగోభాగమో నేటి సంస్కర్తలమని ఒళ్లు విరచుకొనితిరిగే నాయకులకువుంటే దేశానికీగతి యెందుకు పడుతుంది. తాము, తమ ఆస్తి, తమ భార్యా పిల్లలు వీటిని రక్షించు

కానేందుకే వల్ల మాలిన నీతిసూత్రాల నన్నిటిని అల్లి, దేవుడని, నరకమని, పాపమని ఏవేవో పేర్లు పెట్టి అమాయక ప్రజల్ని మోసపుచ్చుతున్నారు కాని తమ కౌసూత్రాలు అన్వయించుకోరు. సంతృప్తిలేని తమ జీవితాలతో నేటి యీ ఎగుడుదిగుడు సమాజాన్ని నిర్మించుతూ మానవ జీవితాల్ని అల్లకల్లోలంగా తయారుచేశారు. ప్రతి మానవుడు నీతి సూత్రాలనే వల్లిస్తూ ఎదుటివాణ్ణి ఎలా బుట్టలో వేయాలా అనే ఆలోచన చేస్తుంటారు ఇదే అతి నాగరిక మనే నేటి సమాజస్థితి. అయితే ఒక భేద ముంది, కొందరు మేడలపైన మేడలు వేసేందుకు మోసాలు చేస్తే, కొందరు కాలే పొట్టను నింపుకొనేందుకు మోసాలు సాగిస్తారు. మొదటి రకం ఘరానా వ్యక్తులు, రెండోరకం "అలగా జనం" అందరి దృష్టిలో.

ఈలా నా ఆలోచన ప్రవాహం వెనక నుండి వచ్చే కారు హారన్ మ్రోతలో అంతమయింది.

ప్రతిదినం నేను పేపర్ కుర్రాడిదగ్గర పేపరు తీసుకోవటం మామూలైంది. రెండుమూడు సార్లు కాఫీ త్రాగమని బలవంతం చేశాను. కాని నమ్రతతో కూడిన నిరాకరణలు లభించాయి. రెండు, మూడురోజుల కొకసారయినా ఆ పేపర్ కుర్రాడు ఓ అయిదునిమిషాలు నా మనసులో నిలిచేవాడు. ఆ కుర్రాడు అప్పుడప్పుడు కొందరితో రాజకీయాలు మాట్లాడడం గూడ విన్నా. స్వాతంత్ర్యం, శాంతి, అభ్యుదయం, నవసమాజం యిల్లాంటి పెద్ద పెద్ద పదాలుకూడా ఆకుర్రాడి నోటంట వెలువడడం విని ఆశ్చర్యపోయేవాణ్ణి. అప్పుడప్పుడు ఆ అబ్బాయితో మాట్లాడుదామనుకున్నా, నడివీథిలో వెధవ పేపర్ కుర్రాడితో మాట్లాడడం నా నాగరికమనసుకు నామోషి అనిపించింది.

ఒక నెలరోజులు గడచిపోయినాయి.

ఒకరోజు, ప్రతిదినం కాఫీ త్రాగేవేళకే పేపరుతో హాజరయ్యే కుర్రాడు ఆ దినం కాఫీ త్రాగి అయిదునిముషాలు కాచుకున్నా రాలేదు. తాలూకా ఆఫీసు గుమస్తాలా ప్రతిదినం నియమిత సమయానికొచ్చే పేపరబ్బాయ్ రాలేదెందుకబ్బా అని ఆలోచించి మరో అయిదు నిముషాలు కాచుక కూర్చొని వెళ్ళిపోయాను.

ఒకటి ... రెండు ... మూడు ... అలాగే ఆరు రోజులు గడచిపోయాయి. పేపర్ కుర్రాడు రాలేదు. ప్రతిదినం ఏమిటా కారణమని తీవ్రంగా ఆలోచించేవాణ్ణి. అంటే పేపర్ల కుర్రాడు నా హృదయంలో ఏదో చెప్పరాని స్థానం ఏర్పరచుకున్నాడన్నమాట.

ఒక రోజు మధ్యాహ్నం కాబోలు నేనొక కథానిక వ్రాస్తూ మధ్యలో ఏదో అసంతృప్తి కలిగి ప్రశాంతత కోసం యింటి బయట వసారాలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నా ఎలా కథని ముగించటమా అని. నా కథలోని ఒక పట్టభద్రుడు, వున్న కొద్దిపాటి భూమీ పుట్రా అమ్ముకొని బి. ఎ పట్టం పొందిన యువకుడు, నిరుద్యోగంతో భార్యా బిడ్డల ఆకలి అరుపులతో నిట్టూర్పులు నిగిడిస్తూ కనీసం ఒక పాతిక రూపాయల వుద్యోగమైనా దొరుకుతుందేమో నని నానా రకాల త్వాష్ట్రాల కాళ్ళు పట్టుకొని కూడ సఫలుడు కాలేక పోయాడు. అతను చనిపోవా లనుకున్నాడు. అవును. ఆత్మహత్య. ఆత్మహత్య పాపమని అతనికి తెలుసు. అయిదో తరగతిలోనే నీతి సూత్రాల వల్లనలో ఆత్మహత్య పాపమనే నీతి కంఠతా బట్టాడు. 'కాని ఏం చేస్తాడు. యిదే అతని ఆలోచన. తర్వాత నా కలం ఆడలా. "అతన్ని చంపించాలసిందేనా?" అదే ప్రశ్న నా హృదయం నిలదీసి ప్రశ్నిస్తోంది. చంపటం నాకూడ యిష్టంలేదు. అయితే కథ ఎలా ముగింపు చేయాలి? పరిష్కార మార్గ మేదైనా చూడాలా? అదే నా కర్థం కావటంలేదు. నా కొక సమస్యయి కూర్చుంది, ఆలోచనా తరంగాలు రావటం చల్లబడటం జరుగుతోంది. ఇంతలోనే హటాత్తుగా రోడ్డు వైపు చూచా. చేతిలో మందు సీసా పట్టుకొని ఓ కుర్రాడు గబగబా పోతున్నాడు. చూచాను. అవును. ఆ కుర్రాడే. ఆ పేపర్ల కుర్రాడే. ప్రతిదినం నా మనస్సులో మెదిలే అబ్బాయే అతను.

"అబ్బాయ్! పేపర్లబ్బాయ్" కేకేశా.

నా వంక తిరిగి చూచి వస్తున్నాడు. అదే మాసికల చొక్కా, రేగిపోయిన సంస్కార రహితమైన జుట్టు. అవే చురుకైన కండ్లు. కాని ఆ కండ్లలో రోజు కంటె యింకా ఎక్కువ దైన్యత కనుపిస్తోంది.

లెక్కించుకుంటూ వచ్చేవానిలా తల వంచుకొని మెల్లగా మెక్కెనాడు.

"నమస్కారం బాబయ్యా" చిరునవ్వు నవ్వాలని ప్రయత్నించి విఫలు డయ్యాడని గుర్తించా.

నేనేదో మాట్లాడబోతోంటే అంతలో నే "నేను పేపర్లబ్బాయిని కాదండీ నా పేరు నారాయణ" అన్నాడు విషాదంగా.

"ఏం. ఏమైందేమిటి?" అని ప్రశ్నించా.

"నా వుద్యోగం వూడబీకేశారండి" అన్నాడు. ఏదో నేను వ్రాయలేనంతటి విషాద ఛాయలు అతని ముఖాన గోచరించాయి.

"ఏమిటి విషయం? బాగానే అమ్మకం చేస్తుంటివిగా?"

"బాగానే అమ్మకం చేయబట్టే బాబయ్యా మూడేండ్ల నుండి ఆ వుద్యోగం నిలుపుకుంది."

"సరే అయితే, ఎందుకు తొలగించారు" ఆ అబ్బాయి కథ వినాలనే ఆత్రుత హెచ్చింది నాకు. "నీ గృహ పరిస్థితేమిటి? నీకు అమ్మ నాన్న వున్నారా?" త్వరత్వరగా ప్రశ్నలు కురిపించాను.

"ఏముంది బాబయ్యా! వారం క్రిందట మా నాయనకు పెద్ద జబ్బు చేసింది. దిగదుడుపులు, దిష్టితీయడాలు అన్ని జరిగినాయ్. కాని ఏమీ నయం కనిపింపలా. కనీసం డాక్టరుచేత మందు యిప్పించాలని చూశా. కాని నాకు నెలకు వచ్చే యిరవై రూపాయలతో ఆరుమంది వుండే సంసారం గడిచి యింకేం మిగులుతుందో ఆలోచించండి. అక్కడికీ మా అమ్మ యిరుగిండ్ల వద్ద పొరుగిండ్ల వద్ద బియ్యం దంచి నూకలు తెచ్చేది. అయినా వారానికి కనీసం మూడు నాలుగు పూటలయినా మాకు పస్తుల వ్రాత తప్పదు.

"మీ నాన్న పని చెయ్యలేడా?" మధ్యలో ప్రశ్నించా పేపర్ కుర్రాణ్ణి.

"లేదండి. మొన్న జరిగిన పాడు యుద్ధంలో పాల్గొని కుడికాలు పోగొట్టుకున్నాడు. చెక్క కాలుతో ఏంపని చేస్తాడు చెప్పండి. కాలుకు ప్రతిఫలంగా సర్కారు నాలుగెకరాల భూమి మంజూరు చేసింది. అదెలాగో సేద్యం చేయించుకుంటూ జరుపుకుంటూ ఉంటే కాంగ్రెసు ప్రభుత్వం వచ్చి ఆ భూమిని లాక్కుంది. మా పరిస్థితిని తెల్పుకుంటూ ఎన్ని పిటిషన్లు పెట్టుకున్నా మా గోడు చూచేవారెవరండీ? మా నాన్న యుద్ధంలో పనిచేసే టప్పుడు నెలకో పాతిక పంపుతూ వుంటే మేమేలాగో కాపరం జరుపుకుంటూ నేను థర్డుఫారం వరకు చదివా. కాని గాయపడ్డ మా నాయన యింటికి రావటం, నా చదువుకు తిలోదకాలు సమర్పించటం, సంసారం నెత్తిన పడటం, ఒకే మారు జరిగాయి. నేను నెలకు పదిహేను వంతున పేపరు ఏజెంటువద్ద కుదిరి అందరికంటె బాగా అమ్మకం చేస్తూ వుండేవాణ్ణి తర్వాత కొన్నాళ్లకు ఇరవైరూపాయలు చేయడం జరిగింది. కరువులో అధికమాస మన్నట్లు మా నాన్నకు టైఫాయడ్ జ్వరం వచ్చింది పరిస్థితి క్లిష్టమైయింది. యిరుగు పొరుగువారు డాక్టర్ కు చూపించమని సలహాయిచ్చారు. మా నాన్న బ్రతుకే నమ్మకం లేకుండాపోయింది. ఇంట్లో అమ్మ, బిడ్డలు లబలబ కొట్టుకొంటున్నారు. స్టాండులో పేపర్లమ్మే నా వద్దకు ఐదేండ్ల తమ్ముడు పరుగెత్తుకుంటూ వచ్చి విషయం చెప్పాడు. వాడి కబురు హఠాత్తుగా ఎవరో చల్లటి నీళ్లు నెత్తిన బోసినట్లు నన్ను వులిక్కి పడేటట్లు చేసింది.

"డాక్టర్ని తీసుకవస్తున్నా పద" అన్నాను.

కాని ఎలా డాక్టర్ని తీసుకపోవటం. కనీసం పదిరూపాయలైనా గావాలి? ఎక్కడినుండి తేవాలి? ఇవే ఆలోచనలు నన్ను పీడించాయ్. జేబు తడిమిచూశా. పేపర్లమ్మిన బాపతు డబ్బు మూడురూపాయలు, ఎవరో చందాదార్లు ఇచ్చింది, ఆరురూపాయలు మొత్తం తొమ్మిదిరూపాయలున్నాయి "యజమాని కాళ్ళమీద పడి చెప్పుకోవచ్చు. ఆయనా మనిషే కదా, రేపు నెలజీతంలో పట్టుకోమని చెబుతా"

అని ఆలోచనచేసి ధైర్యం తెచ్చుకున్నా. డాక్టర్ కాళ్ళావేళ్ళా పడి మా నాన్నను బ్రతికించుకున్నా - కాని..."

"కాని, చెప్పు" అన్నా ఆత్రుత కొద్దీ.

"ఏం చెప్పమంటారు బాబూ! మరునాడు యిన్ని రోజుల్నుంచి నేను చేసిన సేవనైనా గుర్తించకుండా యజమాని యీ తెంప ఆ తెంప వాయించి ఉద్యోగం నుంచి పీకేశాడు. పైగా "ఇన్ని మాటలు నేర్చినవాడు నా ఉద్యోగంలో వుండలేడ"న్నాడు కాళ్లమీదపడి నా సంసార పరిస్థితినంతా చెప్పుకున్నా. కాని ఆయనకు దయ కలగలా. మెడపట్టి గెంటేశాడు కొట్టు నుంచి. రెండు రోజుల్నుండి ఇంటిల్లి పాది పస్తు. నాన్న పత్యానికైనా ఏమీ లేదు. డాక్టర్ గార్ని బ్రతిమిలాడి మందు పట్టుకెళ్తున్నా."

అంటూ దిగులుగా నిలబడ్డాడు.

ఆ దిగులు, వూపిరాడకుండా గడ్డ కట్టిన దిగులు. నేను ఒక నిముషం నిశ్చేష్టితుడినైనా.

హటాత్తుగా నేను వ్రాసే కథ జ్ఞాపకం వచ్చింది. సరిగ్గా యికే చోట నా కథ నిలిచి పోయింది. కథ ఎలా పూర్తి చేయాలో ఆలోచించే నాకు యథార్థ పరిస్థితిని ఎలా పరిష్కరించాలో ఆలోచించేందుకు కూడ ఆలోచనలు రాలేదు.

"వస్తా సార్!" అని పోబోయేడుకున్నాడు.

"ఆఁ ఏమిటి" తలెత్తి చూశా.

"వెళ్ళొస్తా" అన్నాడు.

కుర్రాడి కేమైనా సహాయం చేయాలనుకుని పర్సు తీసి చూస్తే రెండే రెండు రూపాయలు ఉన్నాయి. పర్సు వెల కూడ లేదు పర్సులో. రెండు రూపాయలు తీసి కుర్రాడి చేత బెట్ట పోయినా కాని ససేమిరా అన్నాడు తీసుకు నేందుకు.

అతి ప్రయత్నంమీద జేబులో వేశా.

"ఇంతకంటే ఎక్కువ సహాయం చేయలేనందుకు చింతిస్తున్నా"

"ఈ పాడు సమాజ వ్యవస్థ నాశన మయినప్పుడే సుఖం ప్రజలకు" అన్నాడు తిరిగి పేపర్ కుర్రాడు.

"అంతే నంటావా" అన్నా పిచ్చిగా.

నారాయణ సెలవు పుచ్చుకొని వెళ్లిపోయాడు. తిరిగి ఏమైనాడో ఎప్పుడూ కనిపించలేదు. కాని వారానికోసారైనా నా మనసులో యిప్పటికీ మెదుల్తున్నాడు.

---

అమెరికన్ విద్యా విధానంలో

# వ్యక్తి స్వాతంత్ర్యాలు

మొవ్వ రాంబాబు

న్యూయార్కు నగరం నుండి వ్రాస్తూ 'హిందూ' పత్రిక విలేఖరి శ్రీ కే. బల రామన్ ఇటీవల అనేకమయిన ముఖ్యవిషయాలను తెలియపర్చాడు. వాటిని మనం పరిశీలించిన అమెరికన్ విద్యార్థుల, అధ్యాపకుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అరికట్టబడి పౌరస్వత్వపు హక్కులు ఏవిధంగా నాశనం చేయబడుతున్నవో అర్థం చేసుకొనవచ్చును. "అన్ అమెరికన్ విధానము"నకై దర్యాప్తు చేస్తున్న విచారణ సంఘము మేసాచ్యూసెట్స్ విద్యాలయంలో టెక్నాలజీ ప్రొఫెసరు ఒకతను కమ్యూనిస్టని ఆ విద్యాలయంవారిమీదను, అదే ప్రొఫెసరుతో విద్యార్థులు సంబంధం ఏర్పరచుకొన్నందుకు హార్వార్డు యూనివర్సిటీ వారి మీదను పెద్దఎత్తున ఒత్తిడి తీసుకొని రాబడింది.

అనేకమయిన యూనివర్సిటీలను అంటున్నట్లుగానే ఏల్ యూనివర్సిటీమీదకూడా అధ్యాపక వర్గాలలో కమ్యూనిస్టులను పోషించుతున్నట్లు, విద్యార్థులలో ఐక్యభావాలు వృద్ధి పొంది మతప్రాధాన్యం పోతున్నట్లు నిందారోపణ రావటం వల్ల ఆ యూనివర్సిటీ ప్రెసిడెంటు కొందరు ముఖ్యులయిన పాత విద్యార్థులను ఒక కమిటీగా తయారుచేసి ఒక నివేదిక తయారుచేయుమని కోరారు. ఆ కమిటీవారు వెలువరించిన విషయాలు అమెరికన్ అధికార వర్గాలవారి విధానానికి ఆలోచనలకు ఒక విధ